క్లుప్తంగా

డివిజన్ అభివృద్ధికి కృషి

కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్



కార్పొరేటర్‌కు సమస్యలు వివరిస్తున్న కాలనీవాసులు

పటాన్‌చెరు: డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో మాజీ వార్డు సభ్యులు వీరారెడ్డితో కలసి పర్యటించాడు. కాలనీ వాసులు డ్రైనేజీ లైన్ నిండి మురుగు నీరు రోడ్లపై పారుతుందని కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన కార్పొరేటర్ వెంటనే జీహెచ్ఎంసీ ఎయిర్ టెక్ మిషన్ పిలిపించారు. పూడుకుపోయిన డ్రైనేజీ పైపుల వ్యర్థాలను తొలగించాలని సూచించారు.

ఇన్‌చార్జ్ సర్పంచ్‌గా మురళి



సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న మురళి

జిన్నారం(పటాన్‌చెరు): అన్నారంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఉపసర్పంచ్ మురళికి ఇన్‌చార్జి సర్పంచ్‌గా ఎంపీడీఓ చంద్రశేఖర్ బాధ్యతలు అప్పజెప్పారు. వార్డు సభ్యుడు శేఖర్‌ను ఉపసర్పంచ్‌గా ఎంపిక చేశారు. అనంతరం మురళి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించేలా చర్యలు చేపడుతానన్నారు. గ్రామపంచాయతీ నిధుల గోల్‌మాల్ విషయంలో అన్నారం సర్పంచ్ తిరుమలవాసు సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. ఈ సంఘటనతో ఇన్‌చార్జి సర్పంచ్‌ను నియమించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుదర్శన్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

'బెంచీలు అందజేయడం అభినందనీయం'



బెంచీలతో జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, ఎంఈఓ, దాత అలవేణి

కొండాపూర్(సంగారెడ్డి): తను బోధించే ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం సొంత డబ్బులతో బెంచీలు కొని అందజేయడం అభినందనీయమని జెడ్పీసీఈఓ ఎల్లయ్య తెలిపారు. బుధవారం మండల పరిధిలోని తమ్మలిబాయి తండాలో గల ఎంపీపీఎస్‌లో ఉపాధ్యాయురాలు అలవేణి బెంచీలను బహూకరించారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మనోజ్‌రెడ్డి ఎంఈఓ భీంసింగ్, ఎంపీడీఓ జయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.


ఆర్ఎంపీ, పీఎంపీల నూతన కేలండర్ ఆవిష్కరణ

పటాన్‌చెరు టౌన్: ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల నూతన సంవత్సర కేలండర్‌ను లయన్స్ క్లబ్‌లో బుధవారం రాష్ట్ర అధ్యక్షుడు కన్న శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మధుసూదన్, కార్యదర్శి రమేశ్, ఎండీఆర్ పౌండేషన్ చైర్మన్ దేవేందర్ రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవేందర్ రాజు మాట్లాడుతూ ఆర్ఎంపీ, పీఎంపీలు అత్యవసర సమయంలో రోగులకు ప్రథమ చికిత్స చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. జిల్లా అధ్యక్షుడు బిక్షం గౌడ్, ఆర్ఎంపీ జిల్లా కార్యదర్శి నర్సింలు, పటాన్‌చెరు అధ్యక్షుడు దత్తయ్య, ఉపాధ్యక్షుడు హరికృష్ణ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల అందజేత

కంగ్టి(నారాయణఖేడ్): కంగ్టి మండలంలో లబ్ధిదారులకు బుధవారం ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. తడ్కల్ గ్రామానికి చెందిన రుస్తుం సత్తార్‌కు, నాగన్‌పల్లికి చెందిన షాహినాబేగంకు రూ.60వేల చొప్పున, తడ్కల్‌కు చెందిన సాయిలుకు రూ.25వేలు, షేక్ మైతాబ్‌కు రూ.22వేలు, చాప్టా కేకు చెందిన కళావతికి రూ.32వేలు, యశోదకు రూ.14 వేలు, దామర్‌గిద్దాకు చెందిన గంగమణికి రూ.13,500ల చొప్పున పంపిణీ చేశారు. మనోహర్, శంకర్, నారాయణ, సుధాకర్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, విఠల్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

కమ్ముకున్న పొగ మంచు



కొడకంచిలో మంచు కమ్ముకున్న దృశ్యం

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలాన్ని పొగ మంచు కమ్ముకుంది. ఉదయం 10 గంటలకు కూడా పొగ మంచు ఉండటంతో వాహనదారులకు ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పొగ మంచుకు తీవ్రమైన చలి తోడైంది.

సర్వీస్ రోడ్లు కబ్జా

- ఫుట్‌పాత్‌లనూ వదలకుండా వ్యాపార కేంద్రాలుగా మారుస్తున్న వైనం
- ఇబ్బందుల్లో పాదాచారులు, వాహనదారులు
- పట్టించుకోని టౌన్‌ప్లానింగ్, పోలీస్ సిబ్బంది



సదాశివపేటలోని రోడ్డుపై వెలసిన పండ్ల, ఇతర దుకాణాలు

సదాశివపేట(సంగారెడ్డి): జిల్లాలోని మున్సిపాలిటీలు, మేజర్ గ్రామ పంచాయతీల పరిధిలోని సర్వీస్ రోడ్లను వ్యాపారులు కబ్జా చేసుకొని యథేచ్ఛగా తమ కార్యకలాపాలు నిర్వహించుకుంటున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు పాదాచారులు, వాహనదారులు, నరకం చూస్తున్నారు. ఈ విషయంలో పట్టించుకునే అధికారులే కరువయ్యారు. సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్, పటాన్‌చెరు, జోగిపేట, బొంతపల్లి, జిన్నారం, నారాయణఖేడ్, రామచంద్రాపురం, అమీన్‌పూర్, తెల్లాపూర్, ఇస్నాపూర్, దిగ్వాల్, రంజోల్ తదితర పట్టణాల్లోని సర్వీస్‌రోడ్డును ఇరువైపులా కబ్జా చేసి వ్యాపార కేంద్రాలుగా మార్చుకుంటున్నారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ ట్రాఫిక్ జామ్ అవుతుంది. ఈ సమయంలో వాహనాలు కదలవు, ప్రయాణం ముందుకు సాగదు. సదాశివపేట బస్టాండ్ నుంచి జహీరాబాద్‌వైపు, సంగారెడ్డి వైపు బస్సులు, ఆటోలు ఇతర వాహనాలు ఉదయం సాయంత్రం వేళల్లో స్కూల్, కాలేజీ బస్సులు తిలక్‌రోడ్డు, వికారాబాద్ రోడ్డు, జహీరాబాద్‌వైపుగా వెళ్తుతాయి. బస్టాండ్, సిద్దాపూర్‌గౌని, వికారాబాద్ రోడ్డు, బసవ చౌక్, ప్రాంతాల్లో ప్రయాణికులకు, వాహనదారులకు, నాలుగు చక్రాల వాహనదారులు ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు పడుతున్నారు. సర్వీస్ రోడ్లు ఆక్రమించి ఫాస్ట్‌ఫుడ్ బండ్లు, టిఫిన్‌సెంటర్లు, పండ్లు, తోపుడు బండ్లు పెట్టి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగడమే కాకుండా వాహనదారులు, పాదాచారులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఈ విషయంలో చిరువ్యాపారులను ప్రశ్నిస్తే తిరగబడుతున్నారని వాహనదారులు, పాదాచారులు చెబుతున్నారు. అక్కడి దుకాణాలకు పార్కింగ్ స్థలం లేకపోవడంతో వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలంగా మారుతుంది. ఇప్పటికైనా ఈ విషయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



సదాశివపేటలోని ఫుట్‌పాత్‌పై పూల దుకాణం బోర్డులు, ఇతర సామగ్రి

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటాం



పట్టణంలో నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులు, వాహనదారులపై చర్యలు తీసుకుంటాం. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. కూడళ్లు, ఫుట్‌పాత్‌లను, సర్వీసు రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించొద్దు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనపై కేసులు నమోదు చేస్తాం. ట్రాఫిక్‌కి అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవు.

నవీన్‌కుమార్ ఇన్‌స్పెక్టర్ సదాశివపేట

సొంతూళ్లకు వెళ్తే సమాచారం ఇవ్వండి

డీఎస్పీ భీంరెడ్డి



డీఎస్పీ భీంరెడ్డి

పటాన్‌చెరు టౌన్: సొంతూళ్లకు వెళ్తే సమాచారం ఇచ్చి వెళ్లాలని పటాన్‌చెరు డీఎస్పీ భీంరెడ్డి అన్నారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ...పటాన్‌చెరు సబ్ డివిజన్ పరిధిలోని పటాన్‌చెరు, అమీన్‌పూర్, భానూర్, బీడీఎల్, జిన్నారం, బొల్లారం, గుమ్మడిదల, హత్నూర పరిధిలో ఎవరైనా ఊళ్లకు వెళ్తే ఆయా పరిధిలోని పోలీస్ స్టేషన్లలో సమాచారం ఇవ్వాలన్నారు. ఊరికి వెళ్లేవారు తలుపులకు సెంట్రల్ లాక్ సిస్టమ్, సెక్యూరిటీ అలారం, సెన్సార్‌ను అమర్చుకుంటే మంచిదన్నారు. విలువైన నగదు, ఆభరణాలను బ్యాంక్ లాకర్లలోగానీ, తెలిసిన వారి వద్ద గానీ భద్రపరచాలన్నారు. కాలనీ, బస్తీల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే స్థానిక పోలీస్ స్టేషన్లో లేదా డయల్ 100కు ఫోన్‌చేసి సమాచారం అందించాలన్నారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు సహించం

జెడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్

జిన్నారం(పటాన్‌చెరు): ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిపై బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్ ఆరోపణలు చేస్తే సహించమని జెడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్ అన్నారు. అన్నారం గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నారంలోని 261 సర్వేనంబర్‌లో అక్రమాల విషయంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిపై ఆరోపణలు చేయడం తగదన్నారు. త్వరలోనే రైతులకు పట్టా, పాసుపుస్తకాలను ఇస్తారని కుమార్‌గౌడ్ చెప్పారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తిరుమలవాసు, గోవర్ధన్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, బిక్షపతి, నరహరి తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపైనే పోరాటం

సర్పంచ్ తిరుమలవాసు



సమావేశంలో మాట్లాడుతున్న తిరుమలవాసు

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామపంచాయతీ నిధులు గోల్‌మాల్ అయ్యాయని ఆరోపిస్తూ అవినీతిపైనే తన పోరాటమని సస్పెన్షన్‌కు గురైన అన్నారం సర్పంచ్ తిరుమలవాసు పేర్కొన్నారు. అన్నారం గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సహకారంతోనే 261 సర్వేనంబర్‌లోని రైతుల సమస్య కొలిక్కి వచ్చిందన్నారు. కొంత మంది తన సస్పెన్షన్‌ను రాజకీయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనతోపాటు ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు చెక్ పవర్ ఉన్నప్పుడు నిధులు గోల్‌మాల్ జరిగాయనే ఆరోపణలో నన్ను ఒక్కడినే బాధ్యుడిని చేయడం బాధాకరమన్నారు. అధికరుల తీరుపై న్యాయం పోరాటం చేస్తానని, తాను ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని ఆయన వివరించారు.

తాగునీటి సరఫరా

ఝరాసంగం(జహీరాబాద్): మిషన్ భగీరథ నీరు సరఫరాకాకపోవడంతో బుధవారం అధికారులు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. భోజ్యా నాయక్ తండా పరిధిలోని భోజ్యానాయక్ తండా, రామచందర్ తండా, పుర్యానాయక్ తండా, టోప్యానాయక్ తండాల్లో 27 రోజులుగా మిషన్ భగీరథ నీరు రావడం లేదని తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు తండావాసుల ఫిర్యాదు మేరకు అధికారులు నీటి సరఫరా చేస్తున్నారు. దీంతో గ్రామ పంచాయతీ తరపున ట్యాంకర్ ఏర్పాటు చేసి తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు పంచాయతీ పాలకవర్గం పేర్కొంది.

'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి'

న్యాల్‌కల్(జహీరాబాద్): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీఓ సురేష్ విద్యార్థులకు సూచించారు. మండల పరిధిలోని టీకూర్ పాఠశాలను సందర్శించిన ఆయన అక్కడ మరుగుదొడ్లు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్తా, చెదారాన్ని వేయకూడదన్నారు. ఆయన వెంట సర్పంచ్ అమీర్, పంచాయతీ కార్యదర్శి ఇంద్రజ తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

నారాయణఖేడ్: నారాయణఖేడ్ మండలం కొండాపూర్ శివార్‌సంద్ తండాలో వడిత్యా హిర్యానాయక్‌కు చెందిన గేదె విద్యుదాఘాతంతో మృతి చెందిందని తండావాసులు తెలిపారు. తండా శివారులోని సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌పార్మర్ వద్ద మేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురైందని వివరించారు. దీని విలువ రూ.65వేల వరకు ఉంటుందన్నారు. బాధితుణ్ణి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

మునిపల్లి ఎంపీడీఓగా అంజలి దేవి



ఎంపీడీఓ అంజలిదేవికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీపీ శైలజా

మునిపల్లి(అందోల్): మునిపల్లి ఎంపీడీఓగా అంజలి దేవిని సంబంధిత జిల్లా అధికారులు నియమించారు. ఎంపీపీ శైలజా శివశంకర్ ఎంపీఓ కార్యాలయంలో బుధవారం ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అంజలిదేవికి ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు ఖమ్రొద్దీన్, నాయకులు ఆనంద్, శశికుమార్ పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో ఎంపిక



ప్రశంసాపత్రం అందజేస్తున్న మంత్రి

కొండాపూర్(సంగారెడ్డి): నిర్మల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లాకు చెందిన రెండు ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కోర్పోల్ జిల్లా పరిషత్ పాఠశాలలో గణితశాస్త్ర ఉపాధ్యాయుడు సిద్ధారెడ్డి సులభంగా గణిత శాస్త్రం ఏవిధంగా నేర్చుకోవాలనే అంశంపై సుమారు వందకు పైగా ప్రాజెక్టులు రూపొందించినందుకు గానూ, సదాశివపేట మోడల్ హైస్కూల్ అన్నపూర్ణ, గైడ్ టీచర్ కల్పన చారిత్రక అభివృద్ధి అనే అంశంలో, నీటిని పీల్చుకునే రహదారి అనే ఉప అంశం రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. ఎంపికైన వారిని జిల్లా కలెక్టర్ శరత్, డీఈఓ రాజేష్ అభినందించారు.

సంక్షిప్త వార్తలు

◆ 28 మందికి కోవిడ్ టెస్టులు

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం 28 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చినట్లు వైద్యసిబ్బంది మనోహర్ తెలిపారు.

◆ నేడు కంగ్టిలో కంటి వెలుగు

కంగ్టి(నారాయణఖేడ్): ప్రభుత్వం చేపట్టనున్న కంటివెలుగును గురువారం ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్కె గంగారాం తెలిపారు.

◆ నేడు శ్రీశైలానికి పాదయాత్ర

ఝరాసంగం(జహీరాబాద్): శ్రీశైల మహా క్షేత్రానికి ఝరాసంగం నుంచి పాదయాత్రగా తరలి వెళ్తున్నట్లు నిర్వాహకులు సంజీవ్ సింగ్, మాణిక్ రెడ్డి, శివకుమార్, ఆకాష్ పేర్కొన్నారు. గురువారం దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకి సంగమేశ్వర ఆలయంలో పార్వతీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించి బయలుదేరనున్నట్లు వారు తెలిపారు.

◆ నేడు సాంస్కృతిక పోటీలు

నారాయణఖేడ్: మిత్ర సోషల్ సర్వీస్ అసోసియేషన్ తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నారాయణఖేడ్‌లోని అప్పారావుషెట్కార్ విగ్రహం వద్ద 12న సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేసన్ బాధ్యులు తెలిపారు.

◆ ముగ్గుల పోటీలు

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చిన్నారులకు సంక్రాంతిపై అవగాహన నిర్వహించారు. అమీన్‌పూర్ పట్టణంలోని ప్రైవేటు పాఠశాలల్లో బుధవారం నిర్వహించిన కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

◆ ఊరడమ్మకు బోనాలు

కోహీర్(జహీరాబాద్): పీచేర్యాగడి గ్రామంలో కొలువైన ఊరడమ్మకి బుధవారం బాజా భజంత్రీలు, భక్తిశ్రద్ధలతో ఘనంగా బోనాలు సమర్పించారు. అమ్మవారి సర్వదర్శనం అనంతరం సహపంక్తి భోజనాలు నిర్వహించారు. పోతురాజుల వీరంగాలు, కోలాటం ప్రదర్శన విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రవికిరణ్, ఎంపీటీసీ శుభాంగి రాహుల్, గ్రామ పెద్దలు సంగ్రాం, అనిల్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

◆ బాదాం ఆకుపై స్వామి వివేకానందుడి చిత్రం



నారాయణఖేడ్: స్వామి వివేకానంద జయంతి నేపథ్యంలో అనంతసాగర్‌కు చెందిన ప్రముఖ చిత్రకారుడు గుండు శివకుమార్ బాదాం ఆకుపై స్వామి వివేకానంద చిత్రాన్ని మలిచాడు.

వైద్యం కోసం ఇబ్బందులు పడొద్దు

ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి



చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: వైద్యం కోసం పేదలు ఇబ్బందులు పడొద్దని, మెరుగైన వైద్యానికి కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకునే వెసులుబాటును ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా చెక్కులను ప్రభుత్వం మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం నారాయణఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎనిమిది మందికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఖేడ్ జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్ నాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్ పరశురాం, నాయకులు మూఢ రామకృష్ణ, సాయిలు, మనోహర్, బసప్ప పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. శేరి తండాలో హైమాస్ట్ వీధిదీపాలను, గైరాన్‌తండాలో సామాజిక భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్టీ గురుకులాలను(4) మంజూరు చేయించినట్టు, తండాల అభివృద్ధికి రోడ్లకు నిధులు మంజూరు చేయించినట్లు గుర్తు చేశారు. 54తండాలను పంచాయతీలుగా గుర్తించారన్నారు.

యువత చూపు బీజేపీ వైపు

ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్



బీజేపీలో చేరిన యువతతో నరేందర్ రెడ్డి, శ్రీకాంత్ గౌడ్

పటాన్‌చెరు టౌన్: యువత చూపు బీజేపీ వైపు ఉందని, రాష్ట్రంలో కుటుంబ పాలనకు స్వస్తి పలకాలని ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. బుధవారం ఇస్నాపూర్‌లో వివిధ పార్టీలకు చెందిన యువత బీజేపీలో చేశారు. వీరిని జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు గడీల శ్రీకాంత్ గౌడ్‌లు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్, పటాన్‌చెరు అసెంబ్లీ కో కన్వీనర్ శ్రీనివాస్ గుప్తా, ఓబిసి మోర్చా కార్యవర్గ సభ్యుడు దేవేందర్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మధుకర్ రెడ్డి, ఓబీసీ నాయకులు గడీల శ్రీనివాస్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి కావలి వీరేశం, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు జోగు ధనరాజ్, మండల ఉపాధ్యక్షుడు సాయి కుమార్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు రాచమల్ల నరేందర్ గౌడ్, బూత్ అధ్యక్షుడు అశోక్, బాలి ఆంజనేయులు, కళ్యాణ్ శర్మ, షాపిషా, గొరక్ పటేల్ రమేశ్, అజయ్ రెడ్డి, చందు, సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి



నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లలిత సోమిరెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌లో వడ్డే సంఘం అధ్యక్షుడు రాకేష్ బుధవారం ఏర్పాటుచేసిన వడ్డే ఓబన్న జయంతిలో మున్సిపల్ చైర్ పర్సన్ మల్లేపల్లి లలితా సోమిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల కోసం బ్రిటిష్ వారితో పోరాడిన ఘనత వడ్డే ఓబన్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీశైలం యాదవ్, నాగరాజు, శంషాబాద్ రాజు, వడ్డే సంఘం నాయకులు వడ్డే నరసింహ, విఠల్, రాజు, యాదగిరి, మాజీ ఉపసర్పంచ్ కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, సునీల్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు టౌన్: స్వాతంత్ర పోరాటంలో ఆంగ్లేయులతో ధైర్యంగా పోరాడిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అనుచరుడుగా, సర్వ సైన్యాధ్యక్షుడుగా వడ్డే ఓబన్న కీలక పాత్ర పోషించారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, చిట్కుల్ సర్పంచ్ నీలం మధు ముదిరాజ్ తెలిపారు. అనంతరం ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, వార్డు సభ్యులు దుర్గయ్య, కృష్ణ, వెంకటేష్, రాజ్ కుమార్, యాదగిరి, ఆంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ నారాయణ రెడ్డి, ఎంపీటీసీ నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీశైలం పాల్గొన్నారు.

ఎస్‌ఓను సస్పెండ్ చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మహేశ్



డీఈఓ రాజేశ్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): సమయ పాలన పాటించకుండా ఇష్టానుసారంగా విధులకు హాజరౌతున్న కొండాపూర్ కస్తూర్బా వసతి గృహ ఎస్ఓను తక్షణమే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మహేశ్ డిమాండ్ చేశారు. బుధవారం డీఈఓ రాజేష్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం మహేష్ మాట్లాడుతూ ఎస్ఓ విధులు సక్రమంగా నిర్వహించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని డీఈఓ దృష్టికి తీసుకొచ్చారు. భోజనం మెనూ ప్రకారం పెట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వెంటనే ఎస్ఓపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సాయి, కవిత, మహేశ్వరి, శ్రీవాణి, అఖిల, మమత, అశ్విని, దీపిక, కల్పన పాల్గొన్నారు.

'దైవచింతనతో ముక్తి'



శివస్వాముల పాదయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మదన్ రెడ్డి

హత్నూర(సంగారెడ్డి): సమాజంలో దైవచింతనతోనే ముక్తి లభిస్తుందని ఎమ్మెల్యే మదన్ రెడ్డి అన్నారు. బుధవారం హత్నూర శివాలయం నుంచి గురుస్వామి ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో 50 మంది శివస్వాముల శ్రీశైలం పాదయాత్రకు ఎమ్మెల్యే మదన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శివదీక్షతో మానసిక ప్రశాంతత, భక్తి మార్గం పొందొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆంజనేయులు, ఎంపీపీ అధ్యక్షుడు వావిలాల నర్సింలు, పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, సర్పంచ్ వీరస్వామి గౌడ్, కొన్యాల వెంకటేశం, ఆత్మ కమిటీ చైర్మన్ వెంకటరెడ్డి, కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు శివశంకరరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, యువత అధ్యక్షుడు కిషోర్, అజ్మత్ అలీ, యాదగిరి, బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యులు గోపి, నర్సాపూర్ నియోజకవర్గ కన్వీనర్ వాలుదాస్ మల్లేశం గౌడ్, రాష్ట్ర నాయకులు రఘువీరారెడ్డి, మండలాధ్యక్షుడు నాగప్రభు గౌడ్, బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ నిఖిల్ గౌడ్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఆంజనేయులు గౌడ్, ఎన్ఎస్ వి ఐ మెదక్ జిల్లా కన్వీనర్ మణిదీప్ పలువురు పాదయాత్రలో పాల్గొని శివస్వాములకు సంఘీభావం తెలిపారు.

కంటి వెలుగు విజయవంతం చేయాలి



మాట్లాడుతున్నమున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్



న్యాల్‌కల్‌లో కంటి వెలుగులో మాట్లాడుతున్న జెడ్పీటీసీ స్వప్న భాస్కర్

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న కంటి వెలుగును విజయవంతం చేయాలని జడ్పీటీసీ సభ్యురాలు స్వప్న భాస్కర్ కోరారు. బుధవారం ఎంపీపీ సమావేశ మందిరంలో మండల అధ్యక్షురాలు అంజమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 నుంచి కంటి వెలుగు నిర్వహిస్తారన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు గౌసోద్దీన్, ఎంపీడీవో వెంకట్‌రెడ్డి, ఎంపీవో సురేష్, వైద్యులు శ్వేతప్రియ, భాస్కర్ పాల్గొన్నారు.

కోహీర్(జహీరాబాద్): అంధత్వ నివారణ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న కంటి వెలుగు విజయవంతం చేయాలని ఎంపీడీవో సుజాత నాయక్ పేర్కొన్నారు. ఎంపీపీ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె వివిధ శాఖల అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. కంటి వెలుగు శిబిరంలో వసతులు కల్పించి విజయవంతం చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ రాందాస్, డాక్టర్లు నవీన్‌కుమార్, మనోజారెడ్డి, స్రవంతి పాల్గొన్నారు.

సదాశివపేట(సంగారెడ్డి): కంటి పరీక్షలను ప్రైవేట్ ఆసుపత్రుల్లో చూపించుకోలేని వృద్ధులు, ఆర్థిక స్థోమత లేని వారికి కంటి వెలుగు వరం లాంటిదని మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్ పేర్కొన్నారు. మున్సిపల్ సమావేశ మందిరంలో కంటి వెలుగుపై అవగాహన నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.